నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com

అల్పాహారం అందజేతకు ముందుకు వచ్చిన దాత


డబ్బులు అందజేస్తున్న శైలజా దంపతులు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ జడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌ల సంబంర్భంగా అల్పాహారం అందించేందుకు దాతగా శైలజా దంపతులు రూపాయలు ఐదువేలు నగదును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం హన్మంత్ రెడ్డి , సీనీయర్ టీచర్ బస్వంత్ పటేల్ మాట్లాడుతూ సాయంత్రం సమయంలో పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నందున వారు ఖాళీ కడుపుతో చదువుకోవాల్సి వస్తుందని, దాంతో ఏకాగ్రత కోల్పోతారని తెలిపారు. గతంలో ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం అందజేస్తుండేనని తెలిపారు. విద్యార్థులకు తోడ్పాటునందించిన శైలజ దంపతలను అభినందించారు.

మున్సిపల్ కమిషనర్, డీఎల్‌పీవో బదిలీ

- కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రాజు


బదిలీ అయిన కమిషనర్ ప్రసాద్ చావన్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చావన్ సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. గత సంవత్సరం మార్చి ఒకటిన పదవి బాధ్యతలు స్వీకరించిన ఆయన 11 నెలలు ఆర్మూర్‌లో పనిచేశారు. ఆయన స్థానంలో కొత్త కమిషనర్‌గా ఏ రాజు, మద్రిపేడ నుండి వస్తున్నారు. డిఎల్‌పిఓ శ్రీనివాస్ సైతం బదిలీ అయ్యారు.

చేతి వృత్తులు, హస్త కళాకారుల సంక్షేమానికి విశ్వకర్మ యోజన

- విస్తృతంగా అవగాహన కల్పించాలి : కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంప్రదాయ చేతి వృత్తుల వారిని, హస్తకళాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన(పథకం) పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పీ.ఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఈ పథకం ఉద్దేశ్యాలు, ప్రయోజనాలను వివరిస్తూ, అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. కమ్మరులు, స్వర్ణకారులు, కమ్మరులు, వడ్రంగులు, శిల్పులు, చేతి వృత్తుల వారు, హస్తకళాకారులు వంటి 18 కేటగిరీలలో పని చేస్తున్న వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చని అన్నారు. వడ్రంగులు, పడవల తయారీదారులు, కమ్మరులు, తాళాల తయారీదారులు, బంగారం/వెండి ఆభరణాల పని చేసేవారు, శిల్పులు, చర్మకారులు, తాపీ పనివారు, చీపురు తయారీదారులు, రజకులు, దుస్తులు కుట్టే దర్జీలు, చేపల వలలు తయారుచేసే వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునే చేతివృత్తిదారులు, హస్త కళాకారులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఏ కులానికి సంబంధించిన వారైనా సరే, ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. పీ.ఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి నైపుణ్యం మెరుగుదల కోసం 7 రోజుల నుండి 15 రోజుల వరకు శిక్షణ అందించడం జరుగుతుందని, శిక్షణ కాలంలో రోజుకు 500 రూపాయల చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారని వివరించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేయబడుతుంద న్నారు. అంతేకాకుండా వృత్తి పరికరాలు సమకూర్చుకునేందుకు వీలుగా టూల్ కిట్ కోసం 15000 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు.

అభ్యర్థులు రిజిస్ట్రేషన్ తేదీ నాటికి 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అయితే, గత 5 ఏళ్లలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రుణాలు తీసున్న వారు ఈ పథకానికి అర్హులు కాదన్నారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్, ఎం.ఎస్.ఎం.ఈ అధికారి రాజేష్ యాదవ్, జిల్లా బీ.సీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, ఎస్.సిద్దయ్య పంచాయతీల కార్యదర్శులు, సి.ఎస్.సి. మేనేజర్ గౌతం ఆపరేటర్లు, ఔత్సాహిక విశ్వకర్మలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్‌కు బోర్డు.. సంతకూ బోర్డే

- క్రీడా ప్రాంగణాలు బోర్డులకు పరిమితం
- సౌకర్యాలు కల్పించలే.. ఆటలు ఆడించలే
- అలంకార ప్రాయంగా మారిన వైనం
- సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తేవాలని కోరుతున్న యువకులు, క్రీడాకారులు

నవతెలంగాణ-పిట్లం

గ్రామీణ యువత క్రీడలపై పట్టు సాధించి శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్య వంతులై ఉండాలనే దృఢ సంకల్పంతో గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు సంకల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందే తడవుగా.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లోని ఖాళీ మైదానాలను గుర్తించి క్రీడా ప్రాంగణం అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఏకంగా స్కూళ్లకే బోర్డు ఏర్పాటు చేయడం గమనార్హం.



పిట్లంలో పశువుల సంత నిర్వహించే స్థలంలో బోర్డు ఏర్పాటు

గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ఉపాధి హామీ నుంచి 2 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో చిన్న కొడప్‌గల్, గోడమే గావ్, అన్నారం, చిల్లర్గి, పారడ్‌పల్లి, రాంపూర్, గ్రామపంచాయతీలతోపాటు మండల కేంద్రానికి మూడు క్రీడా ప్రాంగణాలు మంజూరు అయ్యాయి. అయితే వాటి ఏర్పాటప్పుడు తూతూ మంత్రంగా వ్యవహరించినట్టు ఆరోపణలు వ్యక్తమైయ్యాయి. ఖాళీ మైదానం గుర్తించి మొరంతో చదును చేపట్టి కేవలం బోర్డు ఏర్పాటు చేసినట్టు అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వ్యక్తమైయ్యాయి. అయితే క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ఉపాధి నిధులు వెచ్చించినప్పటికీ గత సర్పంచ్‌లు ముందుకు రాకపోవడం గమనార్హం.

స్కూల్‌కు.. సంతకూ బోర్డు

కేటాయించిన నిధులు అరకొర ఉండటంతో క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డు లకే పరిమితమై య్యా యి. పలుచోట్ల ఖాళీ స్థలాలు లేక ఏకంగా.. సంత నిర్వహించే స్థలాలకు, స్కూళ్లకు క్రీడా ప్రాంగణాలు అంటూ బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా.. క్రీడా పరికరాలు మాత్రం అందు బాటులో ఉంచిన దాఖలాలు లేవు. పలు చోట్ల పంపి ణీ చేయాలని వచ్చినా.. పలువురు సర్పంచ్‌లు తమ వద్దనే అట్టి పెట్టుకున్నట్టు ఆరోపణలు వ్యక్తమైయ్యాయి. పిట్లంలో పశువుల మార్కెట్ నిర్వహించే స్థలానికి, పిట్లం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు కేవలం క్రీడా ప్రాంగణాలుగా బోర్డులు ఏర్పాటు చేయగా.. తాజాగా జడ్పీ స్కూల్‌కు బోర్డు మార్చీ మళ్లీ స్కూల్‌గా స్టిక్కర్ అతికించడం గమనార్హం. అలంకారంగా మారిన క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాలని యువకులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన చోట చుట్టూ ప్రహరీ నిర్మించి వివిధ క్రీడలకు సంబంధించిన కిట్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.


పిట్లం జడ్పీహెచ్ఎస్ ముఖద్వారం వద్ద గతంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం అని బోర్డు ఏర్పాటు చేయగా.. తాజాగా స్కూల్ పేరుతో స్టిక్కర్

బోర్డులే ఏర్పాటు చేయడంతో బిల్లులు చెల్లించలే

వెంకటేశ్వర్లు. ఎంపీడీవో పిట్లం

మండలంలో 9 క్రీడా ప్రాంగణములు మంజూరు కాగా చిన్నకొడప్‌గల్ గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణం పూర్తి కావడంతో ఎన్ఆర్‌ఈజీఎస్ నుండి 2 లక్షల రూపాయలు అందజేశాము. కొందరు సర్పంచ్‌లు ప్రాథమిక దశలో బోర్డులు ఏర్పాటు చేసి చివరకు పూర్తి చేయకుండానే విఫలం కావడంతో నిధులు అందించలేకపోయాము.

గౌడ కులస్తుల గ్రామ బహిష్కరణ

- కల్లు కొనవద్దంటూ ఆంక్షలు విధించిన చౌట్‌పల్లి వీడీసీ
- చర్యలు తీసుకోవాలంటూ సీపీకి గౌడకులస్తుల ఫిర్యాదు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వీడీసీలపై చర్యలు తీసుకుంటున్నా.. ఎక్కడో ఒక చోట వీడీసీలు తమ పెత్తనం కొనసాగిస్తూనే ఉన్నాయి. తమ మాటే శాసనంగా పనిచేస్తున్న కమిటీలు.. తమ చెప్పుచేతల్లో లేని వారిపై గ్రామ బహిష్కరణ విధిస్తూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయి. దీంతో పాటు వారి వ్యాపారాలను దెబ్బతీసి ఆర్థిక ఇబ్బందులు సృష్టిస్తుంది. తాజాగా నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి వీడీసీ గ్రామంలో గౌడ కులస్తులను బహిష్కరించి వారి వద్ద ఎవరూ కల్లు కొనుగోలు చేయొద్దంటూ హుకుం జారీ చేసింది. వీడీసీ ఆగడాలు పెరగడంతో చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత గౌడకులస్తులు మంగళవారం సీపీ కల్మేశ్వర్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో 86 గౌడ కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే గౌడ కులస్తులకు, గౌడేతర కులస్తుల మధ్య నెలకొన్న వివాదంలో ఇది వరకు అబ్కారీ శాఖ అధికారులు పరిష్కరించారని, అయినా కానీ వీడీసీ తలదూర్చి వారు చెప్పినట్టు వినాలని ఇటీవల 25 వేల రూపాయలు డిపాజిట్ చేసుకున్నారని, మరికొంత డబ్బులు ఇచ్చి గౌడేతర కులస్తులతో కాంప్రమైజ్ కావాలని అందుకు ఒప్పుకోనందుకు తమను బహిష్కరించిందని గౌడకులస్తులు సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కల్లుతాగనీయకుండా ఆంక్షలు విధించారని, ఎవరైనా అతిక్రమిస్తే రూ.5000 జరిమానా విధిస్తామని చెప్పడంతో తమ వద్ద ఎవరూ కల్లు తాగడం లేదని వాపోయారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- జిల్లా జడ్జి సునీత కుంచాల


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి, సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాఫిక్ రూల్స్ ప్రతిఒక్కరూ పాటించాలని, విలువైన తమ ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా జడ్జి కుంచాల సునీత తెలిపారు. ముఖ్యంగా యువతే దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత రోడ్డు ప్రమాదాల బారిన పడి భవిష్యత్తును కోల్పోవద్దని సూచించారు.

35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు, అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని మేఘన ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ వారి ఆధ్వర్యంలో ఓరల్ అండ్ మ్యాక్సో ఫేషియల్ సర్జరీ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ హాస్పటల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రోడ్డు సేఫ్టీ అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ హాజరై జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ హస్పటల్ నుండి ప్రారంభమై ఆర్.టి.సి బస్టాండ్ తిలక్ గార్డెన్ రైల్వే స్టేషన్ - ఎన్.టి.ఆర్ చౌరస్తా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ.. యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని, చట్టాలను గౌరవించి వాటిని పాటించాలని, రోడ్డు ప్రమాదాలలో ముఖానికి లేదా శరీరానికి బలమైన గాయాలు లేదా ఎముకలు విరిగినప్పుడు సర్జరీ ద్వారా బాగు చేయవచ్చుని, కాని తలకి గాయం అయితే చాలా కష్టం కాబట్టి హెల్మెటు ధరించకుండా అజాగ్రత్తగా వాహనం నడిపి తమను నమ్ముకున్న తల్లిదండ్రులకు గర్భశోకం రాకుండా చూడాలని సూచించారు.

అనంతరం పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకోసం చర్యలు తీసుకుంటునా... ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం రోడ్డు ప్రమాదాలన వలన దాదాపు 320 మంది మరణిస్తున్నారని 680 మంది క్షతగాత్రులు అవుతున్నారని ప్రతీ సంవత్సరం 320 మంది మరణించడం వలన అట్టి కుటుంబాలు నిరాశ్రయులు అవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్. జయ్ రామ్, ప్రొబేషనరీ ఐ.పి.యస్ బి. చైతన్య రెడ్డి, ట్రాఫిక్ ఎ.సి.పి టి. నారాయణ, నిజామాబాద్ ఎ.సి.పి కిరణ్ కుమార్, ఎ.సి.పి పి.ఆరుణ్ కుమార్, ట్రాఫిక్ సి.ఐ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించండి

- తెలంగాణ చెరుకు రైతుల వేదిక కన్వీనర్ తుల రాజేందర్



మాట్లాడుతున్న తుల రాజేందర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మూత పడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిచాలని తెలంగాణ చెరుకు రైతుల వేదిక కన్వీనర్ తుల రాజేందర్ కోరారు. చెరుకు ఉ త్పత్తి దారుల సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఆధ్వర్యంలో రైతు సదస్సు నిజామాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన తెలంగాణ చెరుకు రైతు వేదిక కన్వీనర్ తుల రాజేందర్ మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే పేరు పొందిన బోధన్ చక్కెర ఫ్యాక్టరీ గత పాలకుల తప్పుడు విధానాలు మూలంగానే ముత పడినట్టు తెలిపారు. పాలకులు రైతు వ్యతిరేక విధానాల వల్ల ఫ్యాక్టరీ మూతపడడంతో రైతులు 16వేల ఎకరాల ఆ భూములను కోల్పోయారు. సారంగపూర్ ఎన్సీఎఫ్ సహకార రంగంలో ఉన్న ఏకైక చక్కెర ఫ్యాక్టరీని గత పాలకుల పార్టీల వారు ఆక్రమించుకోవడానికి కుట్నకు పన్నుతున్నారు. వీరి కుట్రలకు వ్యతిరేకంగా చెరుకు రైతాంగం అప్రమత్తంగా ఉండి ఫ్యాక్టరీని కాపాడుకోవాలని ఆయన అన్నారు. ఫ్యాక్టరీలు మూతపడటం వల్ల చెరుకు రైతు కుటుంబాల పరిస్థితి అన్నమో రామచంద్ర లాగా కాలాన్ని వెలదీస్తున్నట్టు తెలిపారు.

వీరి పిల్లలు చదువుకు దూరమై మత్తు పదార్థాలకు అలవాటు పడి వీరి బతుకులను నాశనం చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఫ్యాక్టరీలను తెరిపించేందుకు సబ్ కమిటీ వేసిందని తక్షణమే సబ్ కమిటీ ఈ ప్రాంత ప్రజల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఫ్యాక్టరీలను తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీల పునరుద్దీకరణకు రైతులు పెద్ద ఎత్తున రైతు ఉద్యమాలను తీసుకురా వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ సదస్సులో ఫ్యాక్టరీలపై ఉన్న అప్పులన్నీ మాఫీ చేసి తక్షణమే తెర్పించాలని సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం కమిటీ సమావేశం అయి ఉద్యమ కార్యచరణ రూపొందించుకుని ప్రకటించారు.

ఈ సదస్సులో చెరుకు ఉత్పత్తి దారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య , అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్)జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య , అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, ఎఫ్‌బిఓ చైర్మన్ పృథ్విరాజ్, నాగయ్య, శ్రీనివాసు, వినయ్ కుమార్ ,రైతు నాయకులు బొడ్డు గంగారెడ్డి ,సంతోష్ ,రాజారెడ్డి ,ప్రసాద్ ప్రముఖ కవి ప్రసాద్ ,గంగన్న దాసు ,జెపి గంగాధర్, శ్రీనివాస్, మోహన్, రాజేశ్వర్, వంశీ భారతి ,దేవిక, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో క్షత్రియ జూనియర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్


శ్రీనాథ్


పూజిత

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ జనవరి-2024 ఫలితాల్లో క్షత్రియ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపర్చినట్టు కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌల్ శ్రీనాథ్ 93.04, మేకల పూజిత 87.81 శాతం మార్కులు సాధించినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్, ట్రెజరర్ అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాణి, సీఐ నరేశ్ సూచించారు. పెద్ద కొడపగల్ మండలంలోని జాతీయ రహదారి 161 పోచారం గేటు వద్ద ఐదు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రమాదానికి గల కారణాలను స్థానిక ఎస్ఐ కోనారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ రహదారి అధికారులు, సిబ్బందులకు ప్రమాదాలు అరికట్టేందుకు తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాణి, బిచ్కుంద సీఐ నరేష్, ఎస్సై కోనారెడ్డి, ఇన్సిడెంట్ మేనేజర్ సౌరబ్ ప్రతాప్, పోలీస్ సిబ్బందిలు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రభుత్వం కాషాయీకరణను పెంచిపోషిస్తోంది

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఏల్ మూర్తి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యునివర్సిటీల కన్వెన్షన్
- జయప్రదం కోసం ఆహ్వాన కమిటీ ఎన్నిక


యూనివర్సిటీల కన్వెన్షన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నూతన జాతీయ విద్యా విధానం తో విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యను అందించకుండా కేంద్ర ప్రభుత్వం కషాయీకరణను పెంచి పోషిస్తుందని, ఈ జాతీయ విద్యావిధానం ఓ విపత్తు లాంటిదని దీన్ని నివారణ కోసం ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్త ఉద్యమాన్ని నడిపిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 24, 25వ తేదీల్లో తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర యునివర్సిటీల కన్వెన్షన్ జయప్రదం కోసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్రం రీసెర్చ్ స్కాలర్స్ ఫెలోషిప్‌ల విషయంలో ప్రతి సంవత్సరం కోత విధిస్తుందని అన్నారు.

వివరాలు మెయిన్‌లో..

భార్యను చంపిన కేసులో భర్తకు జీవితఖైదు

నవతెలంగాణ-కామారెడ్డి

భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ కామారెడ్డి జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్ తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ సింధు శర్మ మంగళవారం తెలిపారు. కేసు వివరాలను వెల్లడించారు. బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధి లోని వాజీద్ నగర్ కుమ్మరి చిన్న బాలయ్య ఎలాంటి పని చేయకుండా జులయిగా తిరుగుతూ మద్యానికి బానిసై తన భార్య అంజవ్వను డబ్బులు ఇవ్వాలని అడుగుతుండేవాడు. డబ్బులు ఇచ్చేందుకు అంజవ్వ నిరాకరించడంతో ఇంట్లో వున్నా గొడ్డలితో మెడపై నరకగా అంజవ్వ అక్కడికక్కడే మరణించింది. మృతురాలి అక్క కొడుకు కుమ్మరి అరవింద్ పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తును వేగంగా చేపట్టి నిందితుడికి సకాలంలో కోర్టు నందు ఛార్జిషీట్ వేసి సరైన సాక్షాలు ప్రవేశపెట్టినందున జిల్లా సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించినట్టు తెలిపారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

గతంలో ముప్కాల్ పోలీసు స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఎస్సై విజయ్ నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ముప్కాల్ ప్రాథమిక పాఠశాలలో యువజన సంఘం నాయకులు విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు తాజా మాజీ వార్డు సభ్యులు శ్రీధర్, శంకర్ పటేల్, జక్కుల శ్రీను, మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బుక్స్, పెన్నుల పంపిణీ చేస్తున్న నాయకులు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కి కెజిబివి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కి ఎంపికైనట్లు ప్రత్యేక అధికారి ప్రగతి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీవివి పాఠశాలలో చదివే గుగ్లోత్ నిఖిత ఈ నెల 16, 17, 18, 19వ తేదీలలో గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో 600 మీటర్ల పరుగు పందెంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థినిని వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

- దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-విలేకరులు

మోపాల్ : మండలంలోని బాడ్సి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాడ్సి ఆటో స్టాండ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు మాట్లాడుతూ.. ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రాణాంతకమైన ప్రమాదానికి ఐపిసిలో సెక్షన్ 304(ఎ) ప్రకారం రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉండేవని తెలిపారు కానీ కొత్త చట్టంలో సెక్షన్ 106 (1), (2)గా మార్చబడిన బిఎన్ఎస్ సెక్షన్ 106(1) ప్రకారం 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా కూడా విధించబడుతుందని చెప్పారు. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్ల మనిషి చనిపోతే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా, సెక్షన్ 106(2) ప్రకారం ఎవరైనా అతివేగంగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల చనిపోయి, డ్రైవర్లు పోలీసులకు లేదా మేజిస్ట్రేట్ (హిట్ అండ్ రన్)కి నివేదించకుండా అక్కడి నుండి తప్పించుకుంటే 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధించబడుతుందని చట్టంలో పేర్కొన్నారని తెలిపారు. చట్టానికి సవరణ చేసే ముందు బిజెపి ప్రభుత్వం సంబంధిత సంస్థలతో చర్చించకుండా ఏకపక్షంగా వ్యవహరించడం అన్యాయమని అన్నారు. ఇప్పటికే భారతదేశంలో దాదాపు 30 శాతం సరుకు రవాణా డ్రైవర్ల కొరత ఉందని, రోడ్డు రవాణా రంగం, ముఖ్యంగా ట్రక్కుల విభాగం తీవ్ర సంక్షోభంలో ఉందని తెలిపారు. మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా రోడ్డు రవాణా కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని తెలంగాణ ఫెడరేషన్ నిజామాబాద్ కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కృష్ణ. గుండారం అశోక్, జె.హనుమాన్లు, జె.విట్టల్, జె.రాజారామ్, షౌకత్ అలీ, జి.సాయిలు, కే.దిలీప్, జెనిగల శ్రీనివాస్, రవి నాయక్ పాల్గొన్నారు.

బాల్కొండ:- కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) నాయకులు అన్నారు. మండలంలోని కిసాన్ నగర్‌లో సిజే బీడీ కంపెనీ సెంటర్‌లో దేశ వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్ లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తన్న మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టి పది సంవత్సరాలు పూర్తయినా రైతాంగ కార్మిక ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. భారత్ వెలిగిపోతుంది, అచ్చా దిన్ ఆయేగ, విశ్వగురు, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా, మోసపూరిత నినాదాలు ఇచ్చిన ఏమి జరగలేదని తెలిపారు. ప్రపంచంలోని 125 దేశాల్లో, ఆకలితో భారత్ 111 వ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్రం అమ్మేస్తుందని వీటికి వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్త బందును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నజీర్, మహమ్మద్ ఫయాజ్, రాజేశ్వర్, ఉమేష్, వినోద్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్టు పివైఎల్, పిడిఎస్‌యూ నాయకులు వనమాల సత్యం, జన్నారపు రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్‌నగరంలోని కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్లో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్ల వ్యతిరేక చట్టాల ఉద్యమంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు కూడా నెరవేర్చలేదని అన్నారు. ఈ బందుకు విద్యార్థి యువజన సంఘాలు పూర్తిగా మద్దతు తెలియజేస్తున్నా మని, బందులో కూడా పాల్గొంటా మని తెలిపారు. ఢిల్లీ రైతులపై టీఆర్ఎస్ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు దేవిక, భాస్కర్,వంశీ, సాయిలు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ:-దేశవ్యాప్త గ్రామీణ బందులో పాల్గొంటామని కార్మిక, కర్షక సంఘాల నాయకులు తెలిపారు. కేవీపిఎస్ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యాలయంలో నలవాల నరసయ్య అధ్యక్షన నిర్వహించారు. అనంతరం కొండగంగాధర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16 న దేశవ్యాప్త గ్రామీణ బంధుకు కార్మిక కర్షక సంఘాలు పిలుపునిచ్చాయ న్నారు. మండల కేంద్రాలు, గ్రామాలో కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.

దేశంలో మతన్మాద బిజెపి పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేకచట్టాలను వ్యతిరేకిస్తూ బందులో పాల్గొంటున్నా మన్నారు. బడ్జెట్‌లో దళితులకు చేసింది ఏమీ లేదని, సబ్ ప్లాన్ నిధులు ప్రభుత్వాలు ఖర్చుకు పెట్టకపోవడం, దళిత బంధు అర్హులైన వారికి ఇవ్వకపోవడం, వాటిని దారి మళ్ళించడం వంటి వాటిని నిరసిస్తూ బందుకు మద్దతు నిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మలయాళ సుమన్, ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య, భగవత్ రాజులు పాల్గొన్నారు.



మోపాల్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కంఠేశ్వర్ : మాట్లాడుతున్న కేవీపీఎస్‌నాయకులు



బాల్కొండ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జాతీయస్థాయి కథల పోటీల్లో తడపాకల్ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని లీలావతి దవే బాలల సైన్స్ ఫిక్షన్ కథల పోటీల్లో తడపాకల్ విద్యార్థులు ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. పాఠశాల నుండి ఆరు కథలు పంపగా విద్యార్థిని రిమ్‌షా, రక్షితలకు బహుమతులు లభించాయని అన్నారు. అదే విధంగా జిల్లా స్థాయి సైన్స్, కవిత్వపు పోటీల్లో రెండవ బహుమతి పొంది, రాష్ట్రస్థాయికి ఎంపికైన రిమ్‌షాను ప్రత్యేక బహుమతి పొందిన సాయి సిద్దార్థలను ప్రధానోపాధ్యాయులు జావీద్ అభినందించి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పుడు పద్ధతిలో నడుపుతున్న ప్రవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో తప్పుడు పద్ధతిలో నడుపుతున్న అక్షర గ్రూప్ స్కూల్స్, లండన్ ప్లే, ఎడిఫై, బ్రైట్ ఫౌండేషన్, కేంబ్రిడ్జ్ ప్రవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పిడిఎస్ యూ నగర కమిటీ అధ్వర్యంలో నిజామాబాద్ మండల విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో అక్షర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అనే పేరుతో ప్రచారం నిర్వహిస్తూ సెయింట్ థెరీసా స్కూల్ పేరుతో బోనఫైడ్ ఇస్తున్నారని తెలిపారు. పాత మహమ్మదీయ ఫంక్షన్ హాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎడిఫై స్కూల్ నిర్వహిస్తున్నారని, ఎటువంటి అనుమతి లేకున్నా ఓ కమర్షియల్ బిల్డింగ్ లో లండన్ ప్లే స్కూల్ పేరుతో నడుపుతున్నారని, మిగతా స్కూల్స్ ఎటువంటి నిబంధనలు పాటించకుండా వేల రూపాయలు దోచుకుంటూ అడ్మిషన్లు చేసుకుంటున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే సంబంధిత పైఅధికారులపై పిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర నాయకులు దేవిక, మనోజ్, వంశీ, రాజు తదతరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో దామోదర్ బదిలీ



ఎంపీడీవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

నాలుగున్నర సంవత్సరాలుగా ముప్కాల్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో దామోదర్‌నుకార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ వృత్తిలో బదిలీలు, పదోన్నతులు ఒక భాగం అని అన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కింది స్థాయి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఎంపీవో భరత్ చంద్ర, ఎంపీటీసీ సభ్యులు, తాజా మాజీ సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు, కార్యాలయ సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు..

15న ఉమ్మడి జిల్లాల హ్యాండ్ బాల్ సెలక్షన్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 15న నవ్య భారతి గ్లోబల్ స్కూల్ విశాఖ నగర్ పెర్కిట్ ఆర్మూర్ నందు నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సీనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్‌ని నిర్వహించడం జరుగుతుందని నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17,18,19 తేదీల్లో కరీంనగర్ లో జరగబోయే 52 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్ కార్డ్‌తో నవ్య భారతి గ్లోబల్ స్కూల్-విశాఖ నగర్-పెర్కిట్-ఆర్మూర్ నందు నిజాంబాద్ జిల్లా హ్యాండ్బల్ కోశాధికారి గట్టడి రాజేష్‌కు, వ్యాయామ ఉపాధ్యాయుడు కొంద్ర అంజు కు రిపోర్ట్ చేయాలని తెలిపారు

ప్రతిభ వెలికితీసేలా పిల్లలను ప్రోత్సహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు హాజరై, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కపిల్, సెక్రెటరీ రాజాగౌడ్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో లీడ్ విద్యా వ్యవస్థ చీఫ్ ట్రైనర్స్ ప్రసన్నకుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ సుష్మేంద్ర హాజరై మాట్లాడారు. తొలుతగా కరస్పాండెంట్ మామిడాల మోహన్ మాట్లాడుతూ.. పిల్లలలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని దానిని వెలికి తీసే విధంగా ప్రోత్సహించడమే తల్లిదండ్రుల, గురువుల బాధ్యత అని తెలిపారు. చదువు ఒకటే ముఖ్యం కాదని చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఆసక్తిగల అంశాల పట్ల తల్లిదండ్రులు గ్రహించి వారికి ప్రత్యేకమైన ప్రోత్సాహం కలగజేయాలని అప్పుడే వారు చదువులో కూడా రాణించగలుగుతారని అన్నారు. ఇతర పిల్లలతో బేరీజు వేసుకోవడం మంచి సంప్రదాయం కాదన్నారు.

పిల్లలు ఆశించేది తల్లిదండ్రుల ప్రేమ. తల్లిదండ్రులతో కనీసం రోజుకి ఒక గంటపాటైనా ఆనందంగా గడపాలని కోరుకుంటారన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సదుపాయాల్ని, ఒకేషనల్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ కోడింగ్ మొబైల్ యాప్ డెవలపింగ్ ఇలాంటి కోర్సుల్ని ప్రవేశపెట్టామని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కొన్ని రాయితీలు ప్రకటించారు. చదువులో ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులకు ఉచిత విద్యను ఇస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజాగౌడ్ మాట్లాడుతూ చిన్న పాఠశాలైనా విద్యార్థులు అథ్లెటిక్స్‌లో అద్భుతాలు సృష్టిస్తున్నారని, గత సంవత్సరం అక్టోబర్ లో జరిగిన పోటీలలో ఆక్స్ఫర్డ్ పాఠశాల విద్యార్థులు 8 పథకాలు సాధించగా పోయిన వారంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 16 మెడల్స్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు రావడం అద్భుతం అని కొనియాడారు. రాబోయే కాలంలో జిల్లాలోని విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో ఉచిత అథ్లెటిక్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల నుండి 20 మందిని ఎంపిక చేసి వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకుని, రాష్ట్రస్థాయికి ఎంపికై, ఖమ్మంలో అథ్లెటిక్స్ ఆడి వచ్చిన విద్యార్థులను అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులతో కలిపి శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు అథ్లెటిక్స్ జిల్లా చాంపియన్షిప్‌లో వచ్చిన అవార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఎడ్యుకేషన్ సిస్టం సీనియర్ అకాడమిక్ అడ్వైజర్ ప్రసన్న, అకాడమిక్ అడ్వైజర్ సుష్మేంద్ర, జాతీయ నూతన విద్యా విధానాన్ని అనుసరించి నిర్వహిస్తున్న లీడ్ ప్రణాళికని వివరించి, తల్లిదండ్రుల ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కపిల్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనను తల్లిదండ్రులు ఆసక్తికరంగా పరిశీలించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వి.రమణ, ఇన్చార్జి గంగాధర్, శ్రీశైలం, స్వప్న, ఉపాధ్యాయ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఠల్‌రావు

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని నాగేపూర్ ఉన్నత పాఠశాలలో నవీపేట్, రెంజల్, మండలాల కాంప్లెక్స్ స్థాయి క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. మూడు మండలాల భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులతో పాటు 16 ఉన్నత పాఠశాలల్లోని ఇద్దరు విద్యార్థులు చొప్పున క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. జడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాల నవీపేట్ నుండి శ్రీహర్ష, ముభాషిర నాజ్ జెడ్పిహెచ్ఎస్ నీలా గ్రామం నుండి శైలజ, నందినులు ప్రథమ బహుమతి సాధించగా, కేజీబీవీ నవీపేట్ నుండి లక్ష్మీ ప్రసన్న, స్పందన, జడ్పిహెచ్ఎస్ తాడ్ బిలోలి నుండి అజయ్ కుమార్, సంజనలు ద్వితీయ బహుమతి పొందారు. జడ్పీహెచ్ఎస్ దూపల్లి నుండి రాము, రఘు, జెడ్పిహెచ్ఎస్ నాగేపూర్ నుండి అమృత ప్రియవర్షిని, కీర్తిలు తృతీయ బహుమతిని సాధించారు. వార్షిక పరీక్షల కంటే ముందు విద్యార్థులకు ఇటువంటి క్విజ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రముఖ వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇందిరా, ఉపాధ్యాయులు సాయినాథ్, లక్ష్మీకాంత్, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి కళ్యాణం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ లడ్డు బాలాజీ మందిరంలో వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం చేయనున్నట్టు ఆలయ అర్చకులు శ్రీమాన్ రాచకొండ శ్రీనివాస చార్యులు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- అంగన్ వాడి, పాఠశాల పరిశీలన

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్ గ్రామంలోని అంగన్ వాడి, జిల్లా పరిషత్ పాఠశాలను జెడ్పీ చైర్మన్ డీ. విఠల్ రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని, గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీలలో మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తాగు నీరు కలుషితం కాకుండా ట్యాంక్ లను శుభ్రపరుచుకోవాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు సైతం తమ ఇంటిచుట్టూ శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. అనంతరం మండలంలోని ముల్లంగి, బొంకన్ పల్లి గ్రామాల లిఫ్ట్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముతన్నా, ఎంపీడీఓ క్రాంతి, ఎంపిటిసి సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పంచాయతీ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న జడ్పీ చైర్మన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన



ప్రభుత్వ స్కూల్‌పై ప్రచారం చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భీంగల్

ప్రభుత్వ విద్య వల్ల కలిగే లాభాలను పురాణిపేట్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ విద్యనే ప్రగతికి మెట్టు అని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని న్నారు. అర్హులైన టీచర్లతో విద్యాబోధనతోపాటు యూనిఫాంలు, భోజనం అందజేయబడుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు చెప్పించాలని కోరారు. ఎందరో మేధావులను అందించిన ఘనత ప్రభుత్వ పాఠశాలలకు ఉందని తెలిపారు. బుధవారం వసంత పంచమి సందర్భంగా గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ దరఖాస్తులకు తీసుకోనున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో పురానిపేట విడిసి సభ్యులు, యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు ఎడ్ల శేఖర్ పాల్గొన్నారు.

పార్టీ మారిన కార్పొరేటర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మున్సిపల్ లోని 39, 50 డివిజన్ లకు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిచ్చెంగ్ లత, కృష్ణ, బట్టు రాఘవేంద్రకు బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దేశ అభివృద్ధి కేవలం నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపితోనే సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఇందూర్ పార్లమెంట్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ బానిస సంకెళ్ల తెంచుకొని బిజెపిలోకి రావా లని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బిజెపి పట్టణ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి పట్టణ నూతన కార్యవర్గంను మంగళవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పెర్కిట్ కు చెందిన దుగ్గి విజయ్ రాజేశ్వర్‌తో పాటు మరో ఐదుగురు, ప్రధాన కార్యదర్శిగా పోల్కం వేణు, పులి యుగేందర్ కార్యదర్శులుగా కాందేష ప్రశాంత్‌తో పాటు మరో ఆరుగురు, కోశాధికారుగా ధన్పాల్ శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా రాజు, శ్రీధర్, దేవేందర్ గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు దుగ్గి విజయ్ మాట్లాడుతూ.. పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్ సలహాల మేరకు నిర్విరామ సేవలు చేస్తారని తెలిపారు.



పాలకవర్గ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్


సన్మానం పొందిన పాలకవర్గ సభ్యులు

మండలంలోని జంగంపల్లి గ్రామంలో మంగళవారం మాజీ గ్రామ సర్పంచ్ నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో అనంతరావుకు మండల పంచాయతీ అధికారి, గ్రామ ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాబు, గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులకు సిబ్బందికి శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి



మారుమూల తండాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జగదాంబతండా గ్రామపంచాయతీ ఫకీరాతాండాలో రూ.10లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, బట్టు తాండ మాజీ సర్పంచ్ రాతుల రెడ్డి నాయక్, రాతుల రవి నాయక్, రామారెడ్డి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వడ్ల లక్ష్మీరాజ్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'పొద్దుతిరుగుడు' సాగుకు ఆసక్తి


ఏపుగా పెరిగిన పొద్దుతిరుగుడు పంట

- రెంజల్ సుమారు 150 ఎకరాల్లో పండించిన రైతులు
- గతంలో సాగుకు దూరంగా ఉన్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

ప్రస్తుతం 'పొద్దుతిరుగుడు' పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఈ పంటను భారీగా సాగుచేసేవారు. అయితే రానురానూ ఈ పంట సాగును రైతులు క్రమంగా తగ్గించారు. కాగా.. ప్రస్తుతం గతేడాది నుంచి పొద్దుతిరుగుడు పంటను సాగుచేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.


మండలంలోని కందకుర్తి, నీలా గ్రామ శివారుల్లో సుమారుగా 150 ఎకరాలలో రైతులు పొద్దు తిరుగుడు పంటను పండించారు. ఈ ఏడాది పొద్దుతిరుగుడు పంట ఆశాజనకంగా ఉందని వారు చెబుతున్నారు. ఎకరానికి సుమారు 9 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సంవత్సరం


సాగుచేసిన పొద్దుతిరుగుడు పంట

పొద్దుతిరుగుడు పంటకు అనుకూల వాతావరణం ఉందని, ఈ పంట పండించిన రైతులకు ఈసారి లాభాలు వచ్చే అవకాశం ఉందని స్వయంగా రైతులే పేర్కొంటున్నారు.

దుక్కి దున్ని పంట చేతికి వచ్చేవరకు సుమారుగా ఎకరానికి రూ.25వేల వరకు పెట్టుబడికి ఖర్చు అయ్యిందని, ప్రస్తుతం రూ.6700 క్వింటాకు మద్దతు ధర ఉందని చెబుతున్నారు.

ఆశాజనకంగా పంట



నా 5 ఎకరాల భూమిలో (అడ్వెంట) అనే రకం పొద్దుతిరుగుడు పంటను వేశాను. ప్రస్తుతం ఈ పంట ఆశాజనకంగానే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే తమకు మరింత గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది.

- నీలా, రైతు కరీముద్దిన్

అనుకూల వాతావరణం



గత రెండు మూడు సంవత్స రాలుగా పొద్దుతిరుగుడు పంట అంత లాభదా యకంగా లేకపోవడంతో రైతులు ఈ పంట పై ఆసక్తి చూపలేదు. ఈ ఏడాది అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండడం వల్ల ఈ పంట పండించాం. రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. రూ.25వేల వరకు పెట్టుబడులు పెడితే కనీసం 10 క్వింటాళ్లకు రూ.30 నుంచి 35 వేల రూపాయల వరకు రైతుకు లాభం చేకూరే అవకాశం ఉంది.

- నీలా సింగిల్విండో చైర్మన్ ఇమామ్ బేగ్

ఆర్టీసీలో ప్రయాణం.. సురక్షితం


ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న ఏసీపీ

నవతెలంగాణ-బోధన్

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని బోధన్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాద రహితంగా బస్సులను నడిపిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. అలాగే గత నెలలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులను ప్రగతి చక్రం అవార్డులతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తున్నారని అభినందించారు. కార్యక్రమానికి ఎంవీఐ శోభన్, డిఎం శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని శాలువాతో సన్మానించి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నిజాంసాగర్

ఇటీవల బదిలీపై వచ్చిన నూతన ఎస్సై సుధాకర్‌ను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆయన ఎస్సైని ఆదేశించారు. అన్ని వేళల్లో శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని ఆయన ఎస్ఐకి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రమేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం..

- బంగారం, నగదు చోరీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భాగిర్తిపల్లిలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన కుమార్‌కు చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం కుమార్ స్థానిక పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఎస్ఎన్‌పురంలో పారిశుధ్య పనులు జోరు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామంలో పారిశుధ్య పనులను జోరుగా చేపడుతున్నారు. వాడవాడల్లో రోజువారీగా పరిశుభ్రం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు. దీంతో పలు కాలనీలు శుభ్రంగా కనిపిస్తున్నాయి. పంచాయతీ స్పెషల్ అధికారి, సెక్రటరీ సాయిలు ప్రతి వార్డులో చెత్త, చెదారం లేకుండా ఎప్పటికప్పుడే తరలించి కాలనీలో పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి ఆసరాగా ఉంటున్నారని సెక్రెటరీ తెలిపారు.

విద్యార్థినిది ముమ్మాటికీ హత్యే..

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన కోదండ భారతి శుక్రవారం ఆత్మహత్య చేసుకుందని పేర్కొనడం అసత్యమని, అది ముమ్మాటికి హత్యేనని అఖిల భారత విద్యార్థి పరిషత్ కామారెడ్డి జిల్లా శాఖ మంగళవారం ఆరోపించింది. స్థానిక బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భారతి మృతి చెందడం బాధాకరమని వారు తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆమె మృతికి సంతాపాన్ని ప్రకటించి, మౌనం పాటించారు. భారతిది ఆత్మహత్య కాదని, హత్యేనని తండ్రి, కుటుంబ సభ్యులు హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని జిల్లా కన్వీనర్ చరణ్ ఆరోపిస్తూ స్థానిక ఎస్సై కొండ విజయ్‌కు పిటిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు ఖలీల్, రోహిత్, కళ్యాణ్, వెంకీ, అల్తాఫ్, మురళి తదితరులు ఉన్నారు.

కల్వర్టు రోడ్డు పనులు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మండలంలోని జానకంపల్లి ఊర చెరువు నుంచి బెజగం చెరువు తండా వరకు నిర్మిస్తున్న కల్వర్టు రోడ్డు పనులను జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.కోటి 24లక్షలతో ఈ కల్వర్టు రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణ, ధనుంజయ్, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

నేడు కిసాన్ క్రెడిట్ కార్డుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని గజియానాయక్ తండా రైతు వేదికలో బుధవారం ఉదయం 9:30గంటలకు కిసాన్ క్రెడిట్ కార్డుపై అవగాహనా సదస్సును నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ మంగళవారం తెలిపారు. పశుసంవర్ధక, బ్యాంకింగ్, ఫిషరీస్ వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీడిసి అధ్యక్షుడు ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో వీడీసీ అధ్యక్షుడు ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా మద్ది సూర్యకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, శశి, రమేష్, ప్రధాన కార్యదర్శి భూమ్‌రెడ్డి, కోశాధికారి శ్యామ్‌రెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిని ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ రాజిరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మలుపు మూసివేయాలని వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న కారణంగా మూలమలుపును మూసివేయాలని భిక్కనూరు పట్టణ ప్రజలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు మాట్లాడుతూ.. స్థానిక చర్చి సమీపంలో రామాయంపేట నుంచి భిక్కనూర్ వైపు వస్తుండగా మూలమలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని, ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని మూలమలుపును మూసివేయాలని పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.

జాతీయస్థాయి గణిత శిక్షణకు
జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక

నవతెలంగాణ-కామారెడ్డి

గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీలో ఈనెల 13 నుంచి 17 తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి గణిత శిక్షణకు కామారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు గణిత ఉపాధ్యాయులను తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ద్వారా ఎంపికయ్యారు. ఈ శిక్షణలో వారు గణితాన్ని అనుభవ పూర్వక అభ్యసనం అనే అంశంపై శిక్షణ పొందనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 99 మంది గణిత ఉపాధ్యాయులు ఈ శిక్షణను పొందనున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి డి.మనోహర్ (జి.ప.ఉ.పా.రెడ్డిపేట్), వి.రామకృష్ణ (జి.ప.బాలుర ఉ.పా.చిన్నమల్లారెడ్డి), కె.రాఘవేందర్‌రావు (జి.ప.ఉ.పా. గోపాల్‌పేట్) ఈ 5 రోజుల శిక్షణకు ఎంపికై పాల్గొననున్నారు. ఈ శిక్షణ తర్వాత ఈ అంశాలను వీరు పాఠశాల స్థాయిలో సృజనాత్మతను, తార్కిక ఆలోచనలను పెంచే విధంగా జిల్లాలో అమలు చేయబోతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తెలిపారు. ఈ శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సెక్టోరియల్ అధికారులు, తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్, టీ.ఎం.ఎఫ్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శి రామారావు, కోశాధికారి నరేందర్ తదితరులు అభినందించారు.


ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులు

దోమకొండలో
వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టి, బీసీ, మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీకి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 2010 సంవత్సరంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ కృషితోనే దోమకొండ మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించడంతోనే ప్రజలకు పలు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయా మండలాల, గ్రామాల నుంచి రోజుకు 300 నుంచి 400ల మంది వరకు రోగులు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. రోగుల ఇబ్బందుల దృష్ట్యా గ్రామ పంచాయతీలో పాలకవర్గం వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలం కేటాయించిందని, జడ్పీ సమావేశంలో తీర్మానం చేశామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దోమకొండ వంద పడకల ప్రభుత్వం ఆసుపత్రి మంజూరు చేయించాలని, ప్రస్తుతం 30 పడకలుగా ఉన్న ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, సుతారి రమేష్, బిబిపేట్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు సలీం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామస్వామిగౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి గిరిజనుల పాలభిషేకం


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు మండల గిరిజన నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈనెల 15న గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం సెలవు దినం ప్రకటించడంతో గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పెద్ద ఎత్తున మండల కేంద్రానికి తరలివచ్చి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సేవాలాల్ జయంతి సందర్భంగా సెలవు దినం ప్రకటించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో అత్యధికంగా జనాభా గల గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం సెలవు దినం ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని వారన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మాజీ సర్పంచ్ పరశురాం, దశరథ్, మేఘ్యనాయక్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర నాయకులు ఫతియోద్దీన్, గన్నునాయక్, శివరాంనాయక్ పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆవరణలో చెట్ల కొమ్మలు తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల చెట్ల కొమ్మలను తొలగించాలని, కళాశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో హరితహారం పేరుతో నాటిన మొక్కలు ఎత్తుగా పెరగడం చేత చెట్ల మధ్యలో విద్యార్థులు మలమూత్ర విసర్జన చేస్తున్నారని అన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తెలిపారు. ఈ చెట్లలో డిగ్రీ కళాశాల ఎక్కడ ఉందో కూడా తెలవడం లేదని అన్నారు. 16వ తేదీన రైతాంగ, కార్మిక వర్గాల భారత్ బంద్ ఉందని, దానికి ముందే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల గ్రౌండ్‌ను పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, శివాజీ, కార్తీక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసి, ఏఐపీకేఎస్, ఏఐపీఎంఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా బోధన్ పట్టణంలో వాణిజ్య, వ్యాపార వర్గాల వారు బంద్‌ను పాటించాలని కోరారు. కార్మికులు, ప్రజలు పట్టణంలో జరిగే భారీ ర్యాలీ బహిరంగ సభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బి.మల్లేష్, జే.శంకర్‌గౌడ్, పి.వరదయ్య, పడాల శంకర్, గంధం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను జెడ్పిటిసి మేక విజయ సంతోష్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, అంకితభావంతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ర్యాంకులు తీసుకురావాలని ఆమె విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఆదర్శ పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ఎం.నాగరాజ్, ఉపాధ్యాయులు చెన్నప్ప, జ్యోతి, సుష్మ, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జొన్న, మిరప పంటలకు తెగుళ్లు బెడద

నవతెలంగాణ-పిట్లం

జొన్న, మిరప పంటలకు తెగుళ్లు ఆశించినట్లు వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రదీప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మార్దండ గ్రామంలో జొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జొన్న పంటలో మోగి పురుగు, కత్తెర పురుగు, పేనుబంక సోకినట్లు తెలిపారు. వీటి నివారణకు గానూ ఇమామెక్టీన్, బెంజట్ 120 గ్రాములు, ఎసిపేట్ ఇమిడాక్లోప్రిడ్ 500 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మిరప పంటలో తామర పురుగు వల్ల ఆకులపై ముడత వస్తుందన్నారు. ముడత నివారణకుగానూ స్పైనోసాడ్ లేదా సాయాంట్రానిలిప్రోల్ 240 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే తామర పురుగును నివారించవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తహసీల్దార్ కలీం రెంజల్ మండలానికి బదిలీ కావడంతో తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది మంగళవారం శాలు వాలతో ఘనంగా సన్మా నించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మండల రెవె న్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ నవీన్, ఆపరేటర్లు కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

అబ్బాపూర్ పాలకవర్గానికి సత్కారం

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని అబ్బాపూర్ (ఎం) తాజా మాజీ పాలకవర్గానికి గ్రామంలోని అంగన్వాడీలు ఆశాలు మంగళవారం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి గత ఐదు సంవత్సరాలుగా కృషి చేసిన సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ భూమయ్య, కార్యదర్శి విఠలాచారి వార్డు సభ్యులకు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.



అన్నిరకాల రుణాలు అందిస్తాం

- గ్రామీణ బ్యాంక్ రుణాలపై అవగాహన



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సిరికొండ

గ్రామీణ బ్యాంక్ రుణాలపై అవగాహన సదస్సును న్యావనంది గడ్కోల్, పెదవాల్గోట్ బ్యాంక్ మేనేజర్లు మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా గడ్ కోల్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ యాదగిరి గౌడ్ మాట్లాడుతూ... మండలంలోని రుణాలపై అవగాహన రోడ్ షో నిర్వహించడం జరిగిందని, రైతులకు గ్రామీణ బ్యాంకుల ద్వారా ఐటీ రిటర్స్ లేకపోయినా కూడా వ్యవసాయ ఆదాయం పైన కూడా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. మండల కేంద్రంలో గ్రామీణ బ్యాంక్ లేకపోవడం వలన మూడు బ్యాంకుల ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. 20 నుండి 25 అప్లికేషన్లు తీసుకున్నామని, వీటిలో ఇన్కమ్ సరిపోయిన వారికి హౌసింగ్ లోన్స్, క్రాప్ లోన్స్ ఇవ్వబడతాయని తెలిపారు. రెగ్యులర్‌గా బ్యాంకులో రుణాలు చెల్లించే వారికి ఐటీ రిటర్స్ లేకపోయినా 15లక్షల వరకు రుణాలు అందిస్తామని అన్నారు, వ్యాపార, గృహ, ఎడ్యుకేషనల్, వ్యవసాయ లోన్‌లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

డిచ్‌పల్లి ఎంపిడిఓగా రవీందర్ భాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓకు బొకేను అందజేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎ.రవీందర్ మంగళవారం భాధ్యతలు స్వీకరించారు. ఎలక్షన్ కమిషనర్ అదేశాల మేరకు బదిలీల్లో భాగంగా ఆయన సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలం నుండి డిచ్ పల్లి మండల అభివృద్ధి అధికారిగా వచ్చారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి పూలబొకేలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంద్ర ప్రభుత్వ పథకాలను సాద్వినియోగం చేసుకోవాలని ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నాగారం పదవ డివిజన్‌లో గోశాల దగ్గర ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర -2 కార్యక్రమానికి ముఖ్యతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పల్లెలు, పట్టణాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రద్వారా మోడీ గారి సంక్షేమ పథకాల బండి వస్తుందని తెఇలపారు. ఉజ్వల యోజన క్రింద ఉచిత గ్యాస్ కనెక్షన్స్, గరీబ్ అన్న కళ్యాణ్ యోజన కింద ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, ఉచిత కరోనా టీకా, స్వచ్ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ పథకంతో ఐదు లక్షల బీమా, ముద్ర యోజన కింద చిరు వ్యాపారులకు చేయూతగా, సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆడబిడ్డలకు ఆర్థిక భద్రత, అవాస్ యోజన కింద పేదలకు ఇళ్ల నిర్మాణం, విశ్వకర్మ యోజన కింద చేతి వృత్తుల వారికీ చేయూతగా ఇలా అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర పోషించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా బి.స్నేహిత్, పీఈటిగా సౌమ్య మరికొద్ది మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.గంగారాం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

15న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలి

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని బంజారా సేవాలాల్ భవనం వద్ద ఈనెల 15న సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఉన్నాయని మండల బంజారా సేవా సంఘం అధ్యక్షుడు లష్కర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15 నుండి 20 వరకు సంత్ సేవాలాల్ ఉత్సవాలు జరుగుతాయని అందులో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు ఈనెల 24 నాడు రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని తెలిపారు. సంతు సేవాలాల్ జయంతి కార్యక్రమంలో మండలంలోని మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, బంజారాలు పాల్గొని విజయవంతం చేయాలని, మండల కోరారు సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి రోజు ఈనెల 15న నాడు ఐచ్ఛిక సెలవు ప్రకటించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం జిల్లా నాయకుడు చందర్ నాయక్, ఉపాధ్యక్షులు భూక్య గణేష్ , మానవ చందర్ నాయక్ మండల బంజారా సేవా సంఘం, మాజీ అధ్యక్షుడు బాలకిషన్, జరుపుల ప్రతాప్, మాలావత్ రామ్ రెడ్డి నాయక్ , బాణావతి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంజారా సేవాసంఘం మండల అధ్యక్షులు లష్కర్

మహిళా సంఘం సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలోని మహిళా గ్రామ సంఘంలో చిన్న సంఘాల ప్రతినిధులతో కమ్యూనిటీ కోఆర్డినేటర్ భాజన్న జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. మంగళవారం మహిళ గ్రామ సంఘ సమావేశం కార్యదర్శి గోక జయ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని జీవితాన వెలుగుందని అని ప్రార్థన గీతంతో ప్రారంభించారు. గ్రామ సంఘం ఆర్థిక లావాదేవీలపైన కమ్యూనిటీ కోఆర్డినేటర్ చర్చించారు. అనంతరం మహిళా సంఘాల ప్రతినిధులతో జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా గ్రామ సంఘం ప్రతినిధులు, అన్ని సంఘాల మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పాట్కూరి తిరుపతి రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బిజెపి నిజామాబాద్ జిల్లా కిసాన్ మోర్చా నూతన అధ్యక్షుడిగా మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాటుకూరి తిరుపతి రెడ్డిని నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి అధ్యక్షుడు మాట్లాడుతూ తిరుపతి రెడ్డి రెండు పర్యాయాలు కొలి ప్యాక్ సహకార సంఘం అధ్యక్షునిగా, ఒకసారి ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎనికై గ్రామాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామపంచాయతీ గా నిలబెట్టి ఢిల్లీలోని ప్రధానమంత్రి మోడీ చేతుల మీద అవార్డు తీసుకున్న వ్యక్తి అని అన్నారు. నిజామాబాద్ జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షునిగా కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాడని, ప్రజా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలోని తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలను పైచదువుల కొరకు దత్తత తీసుకొని సామాజిక కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. రైతుల సమస్యలపై ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడికి నన్ను ప్రకటించినందుకు సహకరించిన జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్ కు, పార్లమెంటు సభ్యుడు అరవింద్ కు, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి, నిజాంబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



నియామకపత్రం అందజేస్తున్న దినేష్ కులాచారి

తాజా మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం



సన్మానించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఇటీవలే తమ పదివీ కాలం పూర్తిచేసుకున్న తొర్తి తాజా మాజీ సర్పంచ్ కుండ నవీన్, ఉపసర్పంచ్ తాహెర్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు దశెంధర్, ఉపాధ్యాయ బృందం మంగళశారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు.. సర్పంచ్, ఉపసర్పంచ్లు తమ పదవి కాలంలో పాఠశాలకు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందం, అరవింద్, నవీన్ రెడ్డి, అర్పిత, లింబాద్రి, విష్ణుప్రియ, సంతోషి పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలు

- కొలిప్యాక్ సింగిల్ విండో అధ్యక్షుని కుమారుడి జన్మదినం సందర్భంగా

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొల్‌ప్యాక్ సింగిల్ విండో అధ్యక్షుడు కుమారుడు నాగుల శ్రునీత్ కుమార్ (బిన్ను) జన్మదినం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలూరులో చదువు కుంటున్న విద్యార్థులందరికీ ఒక జత స్కూల్ యూని ఫామ్‌లు తన చేతుల మీదుగా మంగళ వారం అందజేశారు. ఈ సందర్భంగా నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని పేద మధ్యతరగతి విద్యార్థులే ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు తన వంతు సహాయంగా ఈ చిన్న సహాయం చేస్తున్నాని తెలిపారు. రానున్న రోజులలో విద్యార్థులకు అవసరమైన కనీస సదుపాయాలను అందజేస్తానని తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లచ్చన్న మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి సహాయం చేయడం ఆనందదాయకమని కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు ఉపాధ్యాయులు నాగుల శ్రీనివాస్‌ని శాలువాతో సన్మానించారు. పాఠశాల విద్యార్థులు దుస్తులు స్వీకరించి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లింబాద్రి, గుడ్డేటి అశోక్, చిన్నారెడ్డి, అరిగెల అభిలాష్, రఘు వీర్ గౌడ్, బాలకృష్ణ, లింబాద్రి,చింటు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లిగంట అశోక్, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న నాగుల శ్రునీత్

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల అంబేద్కర్ సంఘం సభ్యుడు నల్లవెల్లి గ్రామానికి చెందిన దొనకంటి గంగాదాస్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల అంబేద్కర్ సంఘం సభ్యులు స్పందించి 32 500 కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

బిజెపి గ్రామ శాఖ అధ్వర్యంలో..

నల్లవెల్లి గ్రామానికి చెందిన దొనకంటి గంగాదాస్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ గ్రామశాఖ కమిటీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్ కూమార్ స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు 30 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన నాయకులు

- జెండాఊపి రైలును ప్రారంభించిన ఎంపీ



ఆర్మూర్: అయోధ్యకు బయలుదేరిన నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : నియోజకవర్గం నుండి దాదాపు 200 మంది రామ భక్తులు అయోధ్య రామ మందిర దర్శనానికి మంగళవారం జిల్లా కేంద్రం రైల్వే స్టేషన్ నుండి బయలుదేరారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీల నుండి పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు, రామ భక్తులు వెళ్లారు. ఈసందర్భంగా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అసెంబ్లీకన్వీనర్ పాలెపు రాజు ,అన్ని మండలాల అధ్యక్షులు సీనియర్ నాయకులుచ భూపతి రెడ్డి గంగారెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ: భారతీయ జనతా పార్టీ బీజేపీ కార్యకర్తల కోసం అయోధ్య బాల రాముని దర్శనం కోసం రైలు ఏర్పాటు చేయడంతో బాల్కొండ మండల అధ్యక్షులు అంబటి నవీన్ ఆధ్వర్యంలో 32 మంది బీజేపీ నాయకులు అయోధ్య యాత్రకు బయలుదేరివెళ్లారు. అధ్యక్షులు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా నుండి అయోధ్య వరకు ఆస్థా రైలు ను ఏర్పాటు చేసి నామమాత్రపు రుసుముతో కార్యకర్తలకు అన్ని సదుపాయాలు కల్పించి దర్శనం చేయించి తీసుకురావడం మంచి నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ యాత్ర ఇంచార్జ్ అయినా అమ్దాపూర్ రాజేష్‌ని అధ్యక్షులు అంబటి నవీన్ శాలువాతో సన్మనించారు.

ముప్కాల్: మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి అయోధ్య రామ మందిరం దర్శనం కోసం భక్తులు బయల్దేరి వెళ్లారు. వెళ్లిన వారిలో గడ్డం సంతోష్ రెడ్డి, చిల్క దినేష్, కల్లు స్వామి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు..

మండల వాసి డాక్టర్ దీపక్ రాథోడ్‌కు అరుదైన గౌరవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన డాక్టర్ దీపక్ రాథోడ్ (అర్ కె లక్ష్మీ చిల్డ్రన్ హాస్పిటల్ నిజామాబాద్) ఎంబిబిఎస్ ఉస్మానియా-ఎండి-పిడియాట్రిక్స్, జిప్ మర్ (గోల్డ్ మెడలిస్ట్) వాసికి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లో ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర స్థాయిలో నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమం కాస్ట్ సభ్యులుగా నియమితులైనట్లు మంగళవారం నవతెలంగాణకు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి లో భాగంగా ఐదేళ్లకోసారి తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి వైద్యుడు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌లో తమ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుందని అన్నారు. డాక్టర్ దీపక్ రాథోడ్ కాన్ఫరెన్స్, సిఎంఈ కోసం క్రెడిట్ అవర్స్ మంజూరు చేసే అధికార సభ్యుల్లో ఒకరు. ఈ అవకాశం ఇచ్చిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ గౌరవం దక్కినందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు.రాబోవు రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు సంపాదించి పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు.



బస్సును ఢీకొన్న బైక్

- ఒకరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి-నిజామాబాద్ బైపాస్ రోడ్డులో మంగళవారం బస్సును ప్రమాదవశాత్తు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయినట్లు బోర్గాం 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. కామారెడ్డి జిల్లా రెడ్డిపేట్‌కు చెందిన సుధాకర్ ద్విచక్ర వాహనంపై నిజామాబాద్‌లో తన బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి రెడ్డిపేట్ వెళ్తుండగా డివైడర్ వద్ద ప్రయాణికుడిని దించడానికి బస్సు డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న ద్విచక్ర వాహనం ఢీ కొన్నది. ఈ ఘటనలో సుధాకర్ తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రి తరలించారు.



విద్యార్థినికి, కరాటే మాస్టర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఏర్గట్ల

విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2,3,4 తేదీల్లో ఇంటర్నేషల్ కరాటే పోటీల్లో ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నూనె శ్రీనిధి పాల్గొని అండర్-14 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినందుకు శ్రీనిధిని, శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ పసునూరి అవినాష్‌ను కాంప్లెక్స్ హెచ్.ఎం కృష్ణాచారి, ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం.కృష్ణాచారి మాట్లాడుతూ... అంతర్జాతీయ స్థాయిలో సుమారు 3వేల మంది విద్యార్థులు పాల్గొనగా శ్రీనిధి ఈ ఘనత సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు, మునిరొద్దీన్, ప్రసాద్, శ్రీనివాస్, పవన్, సుశీల, కుదయిజా, రాజశేఖర్, సమిత, స్వరూప, మాలతి, యమన, కోమలి, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలకు తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటు

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర బడ్జెట్‌లో యూనివర్సిటీలకు తక్కువ నిధులు కేటాయించడం సిగ్గు చేటని తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి జయంతి, సోషల్ మీడియా ఇంఛార్జి రవీందర్ అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ముందు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, రాష్ట్ర బడ్జెట్‌లో 8శాతం లోపే నిధులు కేటాయించడం సరైంది కాదని అన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి కేవలం 500 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగిందని, యూనివర్సిటీలు అభివృద్ధి చెందాలంటే అత్యధిక నిధులు కేటాయించడం అవసరమని, బడ్జెట్‌ను సవరించి యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, ఆడిటోరియం, హెల్త్ సెంటర్, మినీ స్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కేసిఆర్‌కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కమిటీ సభ్యులు అక్షయ్, హన్మండ్లు, నవ్య,రేణుక, ప్రవీణ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

టి.జి.ఓ సభ్యత్వ నమోదు టపరిశీలన



నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికల సన్నాహకంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్క జిల్లాను రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులైన సత్యనారాయణ, శ్రీనివాసరావు సందర్శిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం కామారెడ్డి జిల్లాను సందర్శించి, టి.జి.ఓ. సభ్యత్వ నమోదును పరిశీలించారు. కామారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు, సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డా.దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు నీలం లింగం, డా.నిజాం, రాజలింగం, రమేష్, లెఫ్టినెంట్ డా.రామస్వామి, భూమయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎస్పీ సింధు శర్మ



నవతెలంగాణ-కామారెడ్డి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను నెరవేర్చడానికి ప్రతీ గౌడ బిడ్డ కృషి చేయాలని ఎస్పీ సింధు శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జైగౌడ ఉద్యమం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ కోటను ఏలిన మహావీరుడని ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగోల్ల మురళిగౌడ్, అంకన్నగారి శ్రీనివాస్‌గౌడ్, ఇందూరి సిద్ధగౌడ్, తాటిపాముల బాబాగౌడ్, కాసాల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకానికే పరిమితం..

- ప్రారంభం కాని వంతెన నిర్మాణ పనులు
- రోడ్డు సౌకర్యం లేక లింబూరు గ్రామస్తులు ఆవేదన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల పరిధిలోగల లింబూరు వాడి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. గ్రామానికి వెళ్లే మధ్యలో వాగు ఉంది. వాడీ గ్రామస్తులు ఏండ్ల తరబడి రోడ్డు సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితులు ఉంటాయి. వర్షాకాలం నాలుగు నెలల్లో సరైన రోడ్డు సౌకర్యం లేక నడవడానికి కూడా వీలుండదు. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంగా అధికారాన్ని చేపట్టింది. 10 సంవత్సరాలు గడిచినా వాడి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించలేక పోయింది. 2023 సంవత్సరం సెప్టెంబర్ మాసంలో వాడి గ్రామానికి రోడ్డు వాగుపైన వంతెన నిర్మాణానికి మూడు కోట్ల నిధులు మంజూరైనట్లు గత ఎమ్మెల్యే హనుమంతు షిండే 24.09.2023న లింబూర్ గ్రామంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. లింబూర్ నుంచి వాడి గ్రామానికి బీటీ రోడ్డు మధ్యలో వాగుపైన వంతెన నిర్మించడానికి మూడుకోట్లు మంజూరైనట్లు, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అప్పటి ఎమ్మెల్యే హామీనిచ్చినా.. ఎన్నికల హడావిడిలోనే భాగంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేసినట్టు పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో ఇదొక్కటే శిలాఫలకం కాకుండా.. కోట్లాది రూపాయలతో శంకుస్థాపనలు చేసినా.. పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా వాడి గ్రామప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తుందా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద గ్రామస్తులు

పిట్లం ఎస్సైగా నిరేష్



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్సైగా నిరేష్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈయన రుద్రూర్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై విజయ్‌కొండ అతి తక్కువ ఏడాది కాలం పాటు విధులు నిర్వహించి రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై నిరేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం 29వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సాయిబాబా ఆలయంలో ఫల పంచామృతాలు, అష్టద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. రుద్రహెూమం, పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాత రమర్తి సుమన్ రేఖ-పోతారెడ్డి సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామ ప్రధాన వీధుల గుండా సాయిబాబా ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం కొట్టాల గడ్డ, ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షుడు కన్న దామోదర్, ప్రధాన కార్యదర్శి సబ్బని జగదీష్, కోశాధికారి నాగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి డ్రాయింగ్ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి

టెక్నికల్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీలో లోయర్ అండ్ హయర్డ్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా టైలరింగ్, ఎంబ్రాయిడర్ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 25 నుంచి 27 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు నిర్వహించనున్నట్టు డీఈవో పేర్కొన్నారు.

విద్యార్థిని ఢీకొన్న 102 వాహనం

- కాలుకు గాయాలు



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి విద్యనభ్యసిస్తున్న మౌనిక పాఠశాల విశ్రాంతి సమయంలో ఉన్నత పాఠశాల గేటు ముందర గల పిట్లం-తిమ్మానగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి పరిగెత్తుకుంటూ రావడంతో అదే సమయంలో వెళ్తున్న 102 వాహనం సదరు బాలిక కాలుపై వెళ్లడంతో కాలుకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి ప్రమాదానికి కారణమైన వాహనంలోనే తరలించారు. ఉన్నత పాఠశాల ముందర ఆర్‌అండ్‌బీ రోడ్డుపై స్పీడ్ బ్రేకులు ఏర్పాటు చేయలేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

నవతెలంగాణ-సదాశివనగర్

విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావద్దని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణ, సామాజిక మాధ్యమాల వల్ల ఎదురవుతున్న సమస్యలు, మాదక ద్రవ్యాల వినియోగం, యువత విద్యార్థులు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు అమృత రాజేందర్ మాట్లాడుతూ ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన మాదక ద్రవ్యాల వినియోగం నేడు గ్రామాల్లోకి వచ్చిందని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థులు యువత తమ ఉజ్వల భవిష్యత్తును ఇబ్బందికర పరిస్థితులలో తీసుకెళ్తున్నారని వివరించారు. ఈ వ్యసనాల వల్ల కుటుంబాలకు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. సామజిక మాధ్యమాలు నేటి పరిస్థితులలో వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని, విద్యార్థులు తెలిసీ తెలియని వయస్సులో ఆకర్షణ, ఆనందం, వ్యామోహంలో ఉండి వారి జీవితాలను ఇతర వ్యక్తులకు తాకట్టు పెడుతున్నారని తెలిపారు. ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాల్లో గడపకుండా చదువుపై దృష్టి సారించాలని, సోషల్ మీడియాలో ఉన్న అకౌంట్లు క్లోజ్ చేసి ఆ సమయం విద్యను అభ్యసించేలా చేసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం పరిచయాలు చేయకూడదని సూచించారు. సైబర్ నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త పడడం ఉత్తమమని, బాలికలకు సమస్యలు వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. సమస్యల్లో ఉన్నప్పుడు సైబర్ క్రైమ్ 1930, చైల్డ్‌లైన్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 181 టోల్‌ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పదవతరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట్ మండలంలోని మాందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు నెల రోజుల పాటు తన సొంత డబ్బులతో అల్పాహారం అందించే కార్యక్రమాన్ని మండల మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులు, సామాజికవేత్త అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు శ్రద్ధగా విని కష్టపడి చదివి రాబోయే పరీక్షలకు సిద్ధం కావాలని మంచి ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న తరుణంలో విద్యార్థులు పరీక్షల విషయంలో ఎలాంటి భయాందోళన చెందకుండా ఏకాగ్రతతో ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పరిరక్షించేందుకు, విద్యార్థులు చదువుపై దృష్టి నిలిపేందుకు ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడానికి సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. ప్రధానోపాధ్యాయులు సారయ్య మాట్లాడుతూ.. స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు నాగరాజ్‌గౌడ్ తన సొంత డబ్బులతో అల్పాహారం అందిస్తానని ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పహారం అందజేత

ముకిరి నీటి నుంచే దర్శనానికి..

- తడిహిప్పర్గ గ్రామస్తులు ఆవేదన



తడిహిప్పర్గ గ్రామంలో రోడ్డుపై పారుతున్న మురికినీరు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని తడిహిప్పర్గ గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లపైనే మురికి నీరు పారడంతో ఆ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

16న ఉద్యోగా మేళా

- జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్ రావు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 16న ఉద్యోగా మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కామారెడ్డిలో పనిచేసేందుకు అపోలో ఫార్మసీ కంపెనీ వారు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 35 ఏండ్లలోపు వయస్సు కలిగి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 11 నుంచి 25 వేల జీతంతో పాటు ప్రోత్సాహకం కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని 121వ గదిలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, విద్యార్హత మొదలగు ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు. వివరాలకు 7207917714, 7995389260, 9848237987, 9989967088 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం యూత్ అధ్యక్షులు బొంబోతుల సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ ఇంచార్జ్ రాష్ట్ర ఉపాధ్యకుడు రామర్తి గోపి, ప్రతాపరెడ్డి, ఎల్లారెడ్డి యూత్ పార్లమెంట్ కోఆర్డినేటర్ శివరాథోడ్ పాల్గొని పార్లమెంట్ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి యూత్ ఉపాధ్యక్షులు భరత్‌రెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ మండల యూత్ అధ్యక్షులు అజర్ ఖాద్రి, గోవింద్, శ్రీకాంత్, అన్వేష్, ప్రవీణ్‌గౌడ్, కిరణ్, నీలంరెడ్డి వివిధ గ్రామాల యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంపత్‌గౌడ్

పెండింగ్ స్కాలర్‌షిప్ మంజూరు చేయాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట టీజీవీపీ ఆధ్వర్యంలో నిరసన



వినతి పత్రం అందజేస్తున్న టీజీవీపీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని టీజీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీఓ రాజాగౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మీసాల నగేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్ నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 5300 కోట్లకుపైగా నిధులు బకాయిలు ఉన్నాయని వాటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో 'ఎనీమియా ముక్త్ భారత్'

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌బిఎస్‌కే వైద్య బృందం మంగళవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గల విద్యార్థులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలతో పాటు వివిధ రకాల మందులను అందజేశారు. ఈ పరీక్షలను డాక్టర్ విజయభాస్కర్, ఆరోగ్య కార్యకర్త పూర్ణ నిర్వహించారు. రక్తహీనత కలిగి ఉన్న వారందరికీ ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజనేయులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అంతిరెడ్డి రాజిరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రెంజల్ కాంగ్రెస్ నాయకులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ధనుంజయ, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సిహెచ్.రాములు, నాయకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మోజివాడిలో పోలేరమ్మ పండుగ



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మోజివాడి గ్రామంలో మంగళవారం పోలేరమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలతో ప్రతి ఇంటి నుంచి బోనాలను ఊరేగింపుగా పోలేరమ్మ గుడివరకు తీసుకెళ్లారు. అనంతరం పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆలయ దుకాణ సముదాయ గదుల వేలం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని గజియానాయక్ తాండ చౌరస్తాలో శ్రీ వీర హనుమాన్ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని నిర్మించిన దుకాణ సముదాయ గదులను బుధవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ప్రభు మంగళవారం తెలిపారు. 20 గదులకు గానూ 18 గదులకు మాత్రమే వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు పదివేల రూపాయల ధరవత్తు చెల్లించాలని తెలిపారు.

రైతులను అక్రమ అరెస్టు చేయడం సరికాదు

నవతెలంగాణ-బోధన్

ఢిల్లీలో కార్మికులు, రైతులు హర్యానా, పంజాబ్, చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో రైతులను వెళ్లనివ్వకుండా కేంద్ర ప్రభుత్వం 144 సెక్షన్ విధిస్తూ రైతులను అరెస్టు చేయడం సమంజసం కాదని అది సిగ్గుచేటని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 3 చట్టాలను వెనక్కు తీసుకోవాలని, రైతులకు గ్యారంటీ చట్టం తీసుకురావాలని, పండించిన పంటలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే డిమాండ్లపై వెళ్తున్న రైతులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రైతుల హక్కుల సాధన కోసం చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, అఖిలభారత ప్రగతిశీల మండలాధ్యక్షులు పడాల శంకర్, ప్రధాన కార్యదర్శి సుల్తాన్ సాయిలు, కార్మిక సంఘం మండలాధ్యక్షులు సీతారాం, సలీం, అశోక్, కబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సీఐని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

బిచ్కుంద సిఐగా నరేష్ బాధ్యతలు చెప్పటిన సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సిఐను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలకు ప్రజలందరూ సహకరించాలని, అదేవిధంగా తమవంతుగా పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కొనారెడ్డి, అహైమద్, హన్మండ్లు, మాజీ సర్పంచ్ రాములు, మష్టాజి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను ఎస్ఐ సందీప్ సోమవారం రాత్రి పట్టుకొని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత అధికారులకు తెలియజేశారు. అక్రమంగా ఇసుక తరలించేవారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తహసీల్దార్ మోతిసింగ్ బదిలీ

- సన్మానించిన నాయకులు



సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి తహసీల్దార్ మోతిసింగ్ వర్ని మండల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న మోతిసింగ్‌ను (రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్) ఎలక్ట్రానిక్ మీడియా.. నిజామాబాద్ జిల్లా బాధ్యులు భుజంగ లింగంతో పాటు, మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన మాలపెద్దులు ఆయన్ను కార్యాలయ చాంబర్లో పూలమాలవేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.